
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

శనివారం 20 జనవరి 2024



రేపు నంద్యాలకు పురందేశ్వరి రాక



నంద్యాల (కల్చరల్), జనవరి 19: నంద్యాలకు మంగళవారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి వస్తున్నట్లు నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె తొలిసారిగా నంద్యాలకు వస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని మధు కోరారు.

దళితులపై దాడులు దాచేస్తే దాగవు

- అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన జగన్‌ను నమ్మరు
- జగన్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 19: నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరిగిన దాడులు దాచేస్తే దాగవని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినంత మాత్రాన దళితులను సీఎం జగన్ మభ్యపెట్టలేరని విమర్శించారు. శుక్రవారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫరూక్ మాట్లాడారు. దళితులపై జరిగిన అఘాయిత్యాలు, ఘోరాలను దాచిపెట్టేందుకు అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. దళితులు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఎస్సీ సెల్ నాయకుడు తిమ్మయ్య, ఎస్టీ సెల్ నాయకుడు డుమావత్ స్వామినాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుడి మద్యం దందా





- సెబ్ పోలీసులకు పట్టుబడిన చంద్రాయుడు
- తెలంగాణ మద్యం విక్రయంపై విమర్శలు
- మరి సూత్రధారులెవరో..?

నంద్యాల క్రైం, జనవరి 19: అతను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవికిశోర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఎమ్మెల్యే ఎక్కడ ఉంటే అతను అక్కడ ఉండి తీరాల్సిందే. లేదంటే శిల్పా రవికిశోర్‌రెడ్డి ఫోన్ వస్తే చాలు రెక్కలు కట్టుకొని వాలిపోతాడు. కార్యక్రమాల్లో హడావుడి చేస్తూ అనధికారిక గన్‌మెన్‌గా వ్యవహరిస్తుంటాడు. అలాంటి వ్యక్తి తెలంగాణ మద్యం విక్రయిస్తూ సెబ్ పోలీసులకు దొరికిపోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యేకు దగ్గరగా ఉంటూ అక్రమంగా మద్యం విక్రయించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా వెనకాల వేరే ముఖ్యుల పాత్రం ఏమైనా ఉందా అన్న సందేహం కలుగుతోంది.

తెలంగాణ మద్యం బాటిళ్లను విక్రయిస్తూ చంద్రాయుడు సెబ్ పోలీసులకు పట్టుబడిన విషయం నంద్యాల పట్టణంలో సంచలనం రేపింది. ఈ ఘటన పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. చంద్రాయుడు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవికిశోర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఎమ్మెల్యే వెనకే ఉంటూ అనధికారిక గన్‌మెన్‌గా వ్యవహరిస్తుంటాడు. ఈయన నివాసం కూడా ఎమ్మెల్యే ఇంటికి సమీపంలోనే ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యేతో అంత్యంత సన్నిహితంగా ఉండే చంద్రాయుడుకు మద్యం బాటిళ్లు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏమొచ్చిందంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. చంద్రాయుడు ఒక్కడే ఈ మద్యం దందా నడిపిస్తున్నాడా లేక అతడి వెనుక అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుల పాత్ర ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా అతడు ఎంత కాలం నుంచి కొనసాగిస్తున్నాడు.. ఎక్కడెక్కడ నుంచి మద్యం డంప్ చేసుకుంటున్నాడు.. ఏ రూట్లో నుంచి తెలంగాణ మద్యాన్ని రవాణా చేస్తున్నాడు.. తనతోపాటు ఇంకెంతమందికి మద్యం వ్యాపారంలో వాటాలు ఉన్నాయనే విషయం పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

పోలీసులకు తెలియకుండానే జరుగుతోందా ?

ఎమ్మెల్యే వెనుక నిత్యం అనధికారిక గన్‌మెన్‌గా వ్యవహరిస్తున్న చంద్రాయుడు అక్రమ మద్యం రవాణా ఉదంతం పోలీసులకు తెలియకుండానే జరుగుతుందా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో పోలీసులు, సెబ్ అధికారులు, సిబ్బంది మద్యం అక్రమ రవాణా, నాటుసారా, కర్ణాటక మద్యం రవాణపై తరచూ దాడులు నిర్వహిస్తున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులను అరెస్టు చేయడంవంటి ఘటనలు జరుగుతున్నాయి. అయితే చంద్రాయుడు పట్ల మాత్రం పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, సెబ్ సిబ్బంది మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీ, అమ్మకం తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రాయుడును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డితో చంద్రాయుడు



నోరు మెదపని సెబ్ అధికారులు

ఎమ్మెల్యే సన్నిహితుడు అక్రమ మద్యం విక్రయిస్తూ సెబ్ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా ఆ విషయాలను వెల్లడించకపోవడం గమనార్హం. ఎంత మొత్తంలో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారన్న అంశాన్ని సెబ్ అధికారులు గోప్యత పాటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో పోలీసులు, సెబ్ అధికారులు జరుపుతున్న విస్తృత దాడుల్లో జిల్లా వ్యాప్తంగా ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో.. ఎవరెవరి వద్ద ఎంత మొత్తంలో మద్యం, సారా స్వాధీనం చేసుకున్నామన్న వివరాలు ఎప్పటికప్పుడు మీడియాకు విడుదల చేయడంతోపాటు ఉన్నతాధికారులకు కూడా నివేదికల రూపంలో పంపుతుంటారు. మరి నంద్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సన్నిహితుడి వద్ద ఎంత మొత్తంలో తెలంగాణ మద్యం పట్టుబడింది అన్నది బహిర్గతం చేయకపోవడం చర్చనీయాంశమైంది. దీన్ని బట్టి సామాన్యులకో రీతి.. అధికార పార్టీ అండదండలు ఉన్న వారికో నీతా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



చంద్రాయుడు అరెస్టును చూపుతున్న సెబ్ అధికారులు (కుడి వైపు ముఖానికి కర్చీఫ్ కట్టుకున్న వ్యక్తి)

ఆర్‌యూపై అవగాహన ఉంది

- వర్సిటీలోని సమస్యలు పరిష్కరిస్తా
- విద్యా ప్రమాణాలు పెంచుతా
- ఉప కులపతిగా బాధ్యతలు తీసుకున్న సుధీర్ ప్రేమ్ కుమార్



రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా బాధ్యతలు చేపడుతున్న సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు(అర్బన్), జనవరి 19: రాయలసీమ యూనివర్సిటీపై తనకు పూర్తిగా అవగాహన ఉందని కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఉప కులపతి బెల్లం సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఉర్దూ వర్సిటీ ప్రొఫెసర్ పి. ఫజలూర్ రహమాన్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యామండలిలో పని చేయడం వల్ల యూనివర్సిటీ ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసని అన్నారు. విద్యార్థులు, ఆధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. అందరితో సమన్వయంతో పని చేసేందుకు అవసరమైన వాతావారణాన్ని కల్పిస్తానని చెప్పారు. విద్యా ప్రమాణాలు పెంచే దిశగా అవసరమైన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు చర్యలు చేపడతానని తెలిపారు.

ఆర్థర్‌కు అన్యాయం..!

- జిల్లాలో ఏకైక దళిత సిట్టింగ్ ఎమ్మెల్యే
- ఆయనను కాదని వేరొకరికి టికెట్..
- కడప వాసికి కేటాయించడంతో మనస్తాపం
- విధేయుడిగా ఉన్నా విస్మరించారని ఆవేదన
- భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు సిద్ధం
- టీడీపీలో చేరుతారని ప్రచారం



నంద్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు: వైసీపీలో చేరినప్పటి నుంచి ఆర్థర్ పార్టీకి, వైఎస్ జగన్ కుటుంబానికి విధేయుడిగా ఉంటున్నారు. అంతేగాకుండా, నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడానికి తన వంతు కృషి చేశాడు. నియోజకవర్గ సమన్వయకర్త తనను ఇబ్బంది పెడుతున్నా పార్టీ పెద్దల వరకు విషయాన్ని తీసుకుపోయాడే తప్ప.. సొంత నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోలేదు. దీనికి తోడు ఐప్యాక్ సర్వేలు, ఇతర సర్వేలు కూడా ఆర్థర్‌కే అనుకూలంగా వచ్చాయి. దీంతో నిన్నా మొన్నటి దాకా టికెట్ తనకే అన్న ధీమాతో ఉన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి టికెట్ విషయంలో ఏం అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చినట్లు కూడా తెలిసింది. టికెట్ విషయమై వైసీపీ పెద్దల వద్ద చర్చ నడిచినప్పుడు ప్రభుత్వ కార్యక్రమాలు ఎమ్మెల్యేగా ముందుకు తీసుకువెళ్లాలని, ఇతర విషయాలకు సంబంధించి వేరే వారికి అప్పజెబుతామని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గంలో ఇతర వ్యక్తులు అంటే.. బైరెడ్డి సిద్ధార్థ కాకుండా ఇంకెవరు ఉంటారని, ఒకవేళ సిద్ధార్థ ప్రమేయం ఉంటుందంటే.. అసలు తనకు టికెట్ అవసరమే లేదని కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. దీనికి తోడు డా.సుధీర్ దాదాపు రూ.25 కోట్ల వరకు భరించనున్నాడని, అంతకు మించి లెక్క ఉంటే మాట్లాడదామని ఆర్థర్‌తో చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఏం చెప్పాలో తెలియక ఆర్థర్ టికెట్ ప్రయత్నాలు మానుకున్నాడన్న ప్రచారం తన వర్గం వారి నుంచే వినబడుతోంది. ఈ వ్యవహారాన్నంతా పరిశీలిస్తున్న జనాలు విశ్వసనీయత, నమ్మకం అంటూ వైసీపీ చెప్పే మాటలన్నీ వట్టివేనని విమర్శిస్తున్నారు. వ్యక్తి మంచివాడా కాదా అనే కోణంలో చూడదని, లెక్క ముట్టజెబితేనే టికెట్ దక్కుతుందని, ఇదే వైసీపీ అసలు రంగు అనే విమర్శలు గుప్పిస్తున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌ను కాదని అధిష్టానం వేరే వ్యక్తికి టికెట్ కేటాయించింది. దీంతో నంద్యాల జిల్లాలో ఉన్న ఏకైక దళిత ఎమ్మెల్యేకు అధిష్టానం మొండిచేయి చూపిందన్న వాదన్న బలంగా వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల పార్టీ అంటూనే ఆర్థర్‌కు టికెట్ కేటాయించకపోవడం దారుణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటున్న తనను కాదని కడప జిల్లా వాసికి టికెట్ ఇవ్వడంపై ఆయన తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది. ఈ పరిణామంతో త్వరలోనే తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

ఆర్థర్‌ను మాట్లాడకుండా చేసే ప్రయత్నం..

నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా డా.సుధీర్‌ను నియమించగానే.. ఆర్థర్ తీవ్ర అసహనానికి గురైనట్లు తెలుస్తోంది. ఎవరితో మాట్లాడేందుకు ఇష్టపడక తన ఫోన్‌ను కూడా స్విచ్చాఫ్ చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపైన నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 21 తన మనుమడి పుట్టిన రోజు వేడుకను వేదికగా ఎంచుకున్నారు. ఆ రోజు తన వర్గం వారంతా కర్నూలుకు రావాలని, అందరితో చర్చించి నిర్ణయం తెలియజేస్తానని శుక్రవారం వాట్సాప్ సందేశం పంపారు. అయితే వైసీపీ పెద్దలు రంగంలోకి దిగి ఐప్యాక్ ప్రతినిధులను ఆయన వద్దకు పంపించారు. అధిష్టానానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడవద్దని, తాము చెప్పిందే బయట చెప్పాలని, అసలు పత్రికలు, చానెళ్లకు ఎలాంటి ఇంటర్వ్యూలు ఇవ్వవద్దని ఆదేశించే ప్రయత్నం చేసినట్టు సమాచారం. ఓ సందర్భంలో ఆర్థర్ కలిసి మాట్లాడేందుకు వచ్చిన విలేకరులను ఐప్యాక్ బృందం బయటకు పంపే ప్రయత్నం చేసింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆర్థర్ వర్గం 'నాలుగున్నరేళ్ళు మీరు చెప్పిందే విన్నాం. టికెట్ ఇవ్వకుండా పక్కన పెట్టిన తర్వాత కూడా మీరు చెప్పినట్లు వినాలంటే కుదరదు' అని తెగేసి చెప్పడంతో ఐప్యాక్ బృందానికి ఏం చేయాలో పాలుపోలేదు. ఏం చెప్పినా.. పార్టీకి వ్యతిరేకంగా మాట్లడవద్దని సూచించడంతో.. ఆయన కాస్త మెత్తబడినట్టు సమాచారం. కానీ తన భవిష్యత్ కార్యచరణకు సంబంధించిన సమావేశాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదని కూడా చెప్పినట్లు తెలుస్తోంది.

పార్టీ మారనున్నారా..?

ఐప్యాక్ ప్రతినిధులు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడవద్దంటూ చెప్పినా ఆర్థర్ మాత్రం బాధను ఆపుకోలేకపోయారు. పార్టీ పెద్దలను ఎపుడు కలిసినా.. 'నువ్వు జగన్‌మోహన్‌రెడ్డి మైండ్‌లో ఉన్నావు. తప్పకుండా టికెట్ నీకే. రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన సర్వేల్లో నందికొట్కూరు మొదటి స్థానంలో ఉంది. నువ్వు ఎలాంటి నిరాశ పెట్టుకోవాల్సిన అవసరం లేదు' అని చెప్పారని ఆర్థర్ ఆవేదనకు గురవుతున్నారు. ఆయనవర్గం నాలుగు రోజుల కిందట టికెట్ ఖరారు కాకుంటే.. పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని, ముందుగానే ఏదో దారి చూసుకుంటే మంచిదన్న అభిప్రాయాన్ని ఆర్థర్ ముందు వెలిబుచ్చినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే నందికొట్కూరులో వైసీపీకి భారీ నష్టం చేకూరినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయోమయంలో సిద్ధార్థ వర్గం..

ఆర్థర్ విషయం ఇలా ఉంటే.. పార్టీ నిర్ణయం సిద్ధార్థకు, ఆయన వర్గానికి ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. స్థానికేతరుడికి టిక్కెట్ ఇస్తే పార్టీకే నష్టం వాటిల్లుతుందని, తన వర్గం వారికి ఇవ్వాలని సిద్ధార్థ పట్టుబట్టడంతో.. సీఎం జగన్ కాస్త కటువుగానే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఓ సందర్భంలో 'ఇష్టముంటే పార్టీలో ఉండు.. లేకపోతే పో' అని సిద్ధార్థకు చెప్పినట్లు సమాచారం. దీంతో సిద్ధార్థ చేసేదేమీ లేక వెనుదిరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు డా.సుధీర్ గెలుపు బాధ్యతలను అధిష్టానం సిద్ధార్థపైన పెడితే, ఏ ముఖం పెట్టుకొని కొత్త అభ్యర్థితో ప్రజల్లోకి వెళ్లాలని ఆయన వర్గం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

'అప్పు చేసి కార్యక్రమాలు చేశా'

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: 'నియోజవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలన్నీ అప్పులు చేసి నిర్వహించా... ఇప్పుడు అధికారం లేకుండా కేవలం పార్టీ కార్యక్రమాలనే చూసుకోవాలని అంటున్నారు..' అని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ వైసీపీ అధిష్టానం తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన అభ్యర్థుల నాలుగో జాబితాలో ఆర్థర్‌కు మొండి చేయి చూపి కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌కు టికెట్ కేటాయించింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ కర్నూలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నందికొట్కూరు టికెట్ ఈసారి కూడా తనకే వస్తుందని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తనకు హామీ ఇచ్చాడని తెలిపారు. మరొకరికి టికెట్ ఎందుకు కేటాయించారో అర్థం కావడం లేదన్నారు. ఇతరులకు టికెట్ ఇస్తామని చెప్పి ఉంటే తప్పకుండా సహకరించేవాడినని తెలిపారు. ఇప్పుడు కేవలం పార్టీ కార్యక్రమాలే చూసుకోవాలని వైసీపీ అధిష్టానం చెప్పిందని ఆ ప్రతిపాదనను తాను తిరస్కరించానని ఆర్థర్ చెప్పుకొచ్చాడు. కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా ఫోన్లు చేస్తున్నారన్నారు. ఈ నెల 21న నగరంలో జరిగే కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

రివాల్వర్‌తో హల్‌చల్

అరెస్టు చేసిన పోలీసులు



పోలీసులు లైసెన్సు రివాల్వర్, బులెట్లు స్వాధీనం

పత్తికొండ టౌన్, జనవరి 19: అర్ధరాత్రి వేళ ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి లైసెన్సు రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపిన ఘటన గురువారం అర్ధరాత్రి పట్టణ శివారులో చోటు చేసుకుంది. పత్తికొండ సీఐ మురళీమోహన్ శుక్రవారం వివరాలను వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి మకడల్ నుంచి చెన్నైకు గ్రానైట్ లారీలో శ్రావణ్‌కుమార్ బయలుదేరాడు. పత్తికొండ-ఆదోని రహదారిలో ఉన్న ఉరుకుంద వీరన్న దేవాలయం సమీపాన పంక్చర్ షాపు వద్ద ఆగాడు. అదే సమయంలో వెంకటేష్ వ్యక్తి లారీలో ఉల్లిపాయలను తీసుకెళ్తూ అదే ప్రాంతానికి చేరుకున్నాడు. ఈ సమయంలో లారీల పార్కింగ్ విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రావణ్‌కుమార్.. వెంకటేష్‌పై రాయితో బలంగా నెత్తిపై కొట్టాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన వెంకటేష్ తన దగ్గర ఉన్న లైసెన్సుతో గాలిలోకి రెండు కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.


నంద్యాలలో యోగి వేమన జయంతి

నంద్యాల క్రైం, జనవరి 19: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగి వేమన జయంతిని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేమన ప్రజా కవి, సంఘ సంస్కర్త అన్నారు. విశ్వదాభి రామ వినుర వేమ అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు తెలుగువారికి సుపరిచితాలు అని పేర్కొన్నారు. వేమన పద్యాలలో లోక నీతులు, సామాజిక చైతన్యం అంతర్లీనంగా ఉంటాయన్నారు. అంతగొప్ప విశ్వకవిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ధ్రువపత్రాల భాగోతం!

- పశు సంవర్ధ శాఖ నియామకాల్లో అక్రమాలు
- నోటిఫికేషన్ ముందే భారీగా పుట్టుకొచ్చిన వైనం
- న్యాయం చేయాలంటున్న అర్హులైన నిరుద్యోగులు
- 'బోగస్' అని తేలితే కేసులు నమోదు : జేడీ

పశు సంవర్ధక శాఖలో 2016 నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో స్టేట్ మెరిట్‌సాధించారు. ఉద్యోగ నియామక పరీక్షల్లో వచ్చిన మార్కులకు 'ఇన్ సర్వీస్ కోటా' కింద మరో 15 మార్కులు బోనస్‌గా కలపడంతో ఆయన ఉద్యోగం సొంతం చేసుకున్నారు. ఇది అభినందించాల్సిన విషయమే. అయితే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ప్రభుత్వ శాఖలో చేస్తూ అదే సమయంలోనే 'ఒకేషనల్ డెయిరీ' రెగ్యులర్ కోర్సు చేయడం ఎలా సాధ్యమైంది? డ్యూటీకి ఎలా వెళ్లారు..? రెండేళ్ల ఒకేషనల్ డెయిరీ కోర్సు చదివేందుకు కళాశాలకు ఎప్పుడు వెళ్లారు..? ఇవన్నీ అంతుచిక్కని ప్రశ్నలు. గురువారం విడుదలైన ఉద్యోగ నియామక ప్రతిభ పరీక్షలు ఫలితాల్లో ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారని అర్హులైన నిరుద్యోగ యువత ఆందోళనచెందుతోంది. బోగస్ సర్టిఫికెట్లను పరిశీలనలోనే అడ్డుకట్ట వేస్తే కాలేజీలకు వెళ్లి కష్టపడి చదివిన నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. లేదంటే స.హ చట్టం ద్వారా వివరాలు సేకరించి న్యాయపోరాటం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.



పశు సంవర్ధక శాఖ కార్యాలయం

కర్నూలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1,800 వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబరు 11 వరకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 252 పోస్టులకు గానూ 2,076 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,864 మంది పరీక్షలకు హాజరు అయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలు విడుదల చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానంలో మెరిట్ ఆధారంగా భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నెగిటివ్ మార్కులు పోనూ ఓసీ, క్రీడాకారులు, మాజీ సైనిక ఉద్యోగులకు 40 శాతం, బీసీలు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) 30 శాతం మార్కులు సాధించే ఉద్యోగ నియామకానికి అర్హత (క్వాలిఫైడ్)గా నిర్ణయించారు. ఆపైన మార్కులు సాధించిన వారిలో నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తారని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా మెరిట్ అర్హత సాధించిన వారిలో బోగస్ విద్యార్హతతో పాటు స్పోర్ట్స్, ఇన్ సర్వీస్ కోటా కింద గ్రేస్ మార్కులతో మెరిట్ సాధించిన వారు కూడా ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కర్నూలు నగరం బిక్యాంప్, బిర్లా గేట్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఏజెంట్లను పెట్టుకొని నకిలీ సర్టిఫికెట్ల అమ్మకాలు చేపట్టినట్లు సమాచారం. అతడి నుంచి కొందరు సర్టిఫికెట్లను తయారు చేయించుకుని ఉద్యోగాలు పొందారని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బోగస్ సర్టిఫికెట్లపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ పశు సంవర్ధక శాఖ జేడీకి ఫిర్యాదు చేశారు.

బోగస్ అని తేలితే క్రిమినల్ కేసులు నమోదు



ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టులు 252 ఖాళీ ఉన్నాయి. వీటి భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేస్తే 2,076 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేయగా 1,864 మంది పరీక్షలకు హాజరయ్యారు. గురువారం ఫలితాలు వచ్చాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానంలో మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తాం. దరఖాస్తు నమోదు సమయంలో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విద్యార్హత, స్పోర్ట్స్, ఇన్ సర్వీస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తాం. బోగస్ అని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- రామచంద్రయ్య, జేడీ, పశు సంవర్ధక శాఖ, కర్నూలు

బోగస్‌కు అడ్డుకట్ట వేయండి


ఫిర్యాదు చేస్తున్న నాగేశ్

సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టుల నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్లు భారీగా ఉన్నాయి. వాటిపై పక్కాగా విచారించి కాలేజీలకు వెళ్లి చదువుకున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలి. సమాచార హక్కు చట్టం ద్వారా న్యాయం పోరాటం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

- నాగేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు

వేమన సంఘ సంస్కర్త: కలెక్టర్


నివాళి అరిస్తున్న కలెక్టర్‌డాక్టర్ జి .సృజన

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 19: తెలుగు సమాజాన్ని చైతన్యపరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. శుకవారం కలెక్టరేట్‌లో ని కాన్ఫరెన్స్ హాలులో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తేలికైన పదాలతో రాసిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు స్వీకరించారని అన్నారు. వేమన ప్రజాకవి అని, పామరులు, పండితులను అలరించిన ఆయన కవిత్వం శాశ్వతంగా ఉంటుందని అన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు

ఆస్తి తగాదాలే కారణం

తుగ్గలి, జనవరి 19: నవమాసాలు మోసి కన్న కొడుకే కాలయముడయ్యాడు. ఆస్తి కోసం జన్మనిచ్చిన తల్లిని హతమార్చిన సంఘటన శుక్రవారం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాతనకొత్తూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పచ్చర్లపల్లి లక్ష్మీదేవి (44) కొడుకు లిఖిత్‌కుమార్‌రెడ్డి ఇంటి ముందర గుంటకకు ఉండే ఇనుపరాడ్డు (మేడితోక)తో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో గ్రామానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి హనుమంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. లక్ష్మీదేవి భర్త కృష్ణారెడ్డి ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి లిఖిత్‌కుమార్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె కూడా ఉంది. వీరికి దాదాపు 11 ఎకరాల పొలం ఉంది. అందులో ఐదున్నర ఎకరాలు కొడుకు పేరు మీద, మరో ఐదున్నర ఎకరా లక్ష్మీదేవి పేరున ఉంది. ఆ ఆస్తిని తనకు రాయించలేదని తల్లి లక్ష్మీదేవి తలపై రాడుతో కొట్టి హత్య చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం చేశాడని ఫిర్యాదు

ఆత్మకూరు రూరల్, జనవరి 19: ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలో 12 ఏళ్ల బాలికపై పెద్ద నాన్న అత్యాచారం చేశాడని తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు.

రైలులో కర్ణాటక మద్యం రవాణా

ఆదోని, జనవరి 19 : రైలులో కర్ణాటక మద్యం రవాణ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రైల్వే ఎస్సై గోపాల్ తన సిబ్బందితో ఆదోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మద్యం పట్టుకున్నారు. ఆదోనికి చెందిన బోయ ఉదయ్ కుమార్‌తో పాటు ముగ్గురు 16 బాక్సుల కర్ణాటక మద్యాన్ని ఆరు లగేజ్ బ్యాగులలో వేసుకొని పీఎఫ్ నెం1లో దిగిపోతుండగా అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1536 కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో రైల్వే ఎస్సైతోపాటు హెచ్‌సీ సాయి, పోలీసులు గాదిలింగ, హుస్సైని, పెద్దయ్య పాల్గొన్నారు.

ఆదోనిలో చైన్ స్నాచింగ్

ఆదోని, జనవరి 19 : ఆదోనిలో శుక్రవారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎస్కేడీ కాలనీలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి మహాయోగి లక్ష్మమ్మ దేవాలయానికి ఒంటరిగా దర్శనం కోసం వెళ్లింది. మార్గమధ్యంలో చిన్న మార్కెట్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు తన మెడలోని ఆరు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారని కన్నీరు పెట్టుకుంది. తెల్లవారుజామున ఎవరూ లేకపోవడంతో బైక్‌పై వచ్చిన దుండగులు చైన్‌ను లాక్కొని వెళ్లినట్లు ఆమె పేర్కొంది. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22న శ్రీరామచంద్రుని శోభా యాత్ర


మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 19: అయోధ్య క్షేత్రంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని మంత్రాలయంలో శ్రీరామచంద్రుని శోభా యాత్ర చేపడుతున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. శుక్రవారం గురురాజా సభా ప్రాంగణ భవనంలో అన్ని శాఖల ఉద్యోగులు, గ్రామస్థులతో కలిసి 22న చేపట్టే శోభా యాత్రకు సిద్ధం కావాలని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతి సంప్రాదాయ సనాతన భారతీయ పరిరక్షణ ధర్మజాగృతి కలిగించడానికి మంత్రాలయం పురవీధుల్లో ఊరేగింపునకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. శ్రీరామచంద్రుని శోభా యాత్రకు గ్రామంలో ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. శోభాయాత్ర అనంతరం శ్రీరాముని ఏకశిల విగ్రహాన్ని నిలుచోబెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, విజ్ఞుస్వామి, క్రిష్ణమూర్తి, దత్తు, జేపీ స్వామి, అనంతపురాణిక్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు హక్కులను వినియోగించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 19: అసంఘటిత కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు అవసరమైన సహాయం ఉచితంగా అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తున్నదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క కార్మికుడు ఈశ్రమ్, పీఎం-ఎస్‌వైఎం కార్డును చేయించుకుంటే ఎంతో లబ్ధి పొందవచ్చని, భవిష్యత్తులో కుటుంబానికి ఈకార్డు ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ మాట్లాడుతూ ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేబర్ డిపార్టుమెంటు అసిస్టెంట్ కమిషనర్ సాంబశివ మాట్లాడుతూ కార్మికులు ఈశ్రమ్ కార్డు ద్వారా ఎన్నో రకాలుగా లబ్ధి పొందవచ్చని అన్నారు. న్యాయవాది నిర్మలమ్మ మాట్లాడుతూ శనివారం మార్కెట్ యార్డులో ఈశ్రమ్- పీవై-ఎస్‌వైఎం క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారిపై అఘాయిత్యం జరిగితే ఇంత నిర్లక్ష్యమా?

- నిందితుడు వైసీపీ నాయకుడు కావడం వల్లే అరెస్టు చేయడం లేదు
- పోలీసు స్టేషన్ ఎదుట టీడీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న టీడీపీ జిల్లా నాయకులు, ఇన్‌చార్జిలు

పత్తికొండ, జనవరి 19: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో కొద్ది రోజుల క్రితం ఏడేళ్ల చిన్నారిపై గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అఘాయిత్యం చేశాడని ఆ కేసులో ఇప్పటికి వరకు నిందితుడిని ఎందుకు అరెస్టు చేయలేదంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పార్లమెంట్ సమన్వయకర్త ప్రభాకర్ చౌదరి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ ప్రభాకర్ అన్నారు. నిందితుడిని అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ పత్తికొండ పోలీస్‌స్టేషన్ ముందు కేఈ శ్యాంబాబు, బీవీ నాగేశ్వరరెడ్డి, మీనాక్షినాయుడు, సుజాతమ్మ, టీజీ భరత్, తిక్కారెడ్డిలతోపాటు దేవనకొండ, పత్తికొండ మండలాల టీడీపీ నాయకులు శుక్రవారం ధర్నాకు దిగారు. అత్యాచార సంఘటనపై పోలీసులు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. నిందితుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతో అరెస్టు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. నిందితుడిని అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. దీంతో పోలీసులు ఇప్పటికే నిందితుడిపై కేసు నమోదు చేశామని, ఒకటి రెండు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మావోయిస్టు ఉద్యమంలో గడివేములవాసి మృతి

- ఎన్‌కౌంటర్‌లో గాయపడి చికిత్స పొందుతూ..
- ఆలస్యంగా వెలుగులోకి..


జయమ్మ (ఫైల్)

నంద్యాల క్రైం, జనవరి 19: కేరళలోని ఉరుప్పుంకుట్టి అటవీ ప్రాంతంలో తండర్‌బోల్టు కమాండర్లకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏపీ క్యాడర్‌కు చెందిన మావోయిస్టు నేత నామాల జయమ్మ అలియాస్ కవిత అలియాస్ జ్యోతి మృతిచెందినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో బుల్లెట్ గాయాలతో తప్పించుకున్న ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కేరళ మావోయిస్టు పార్టీ ప్రకటించింది. నంద్యాల జిల్లా గడివేములకు చెందిన జయమ్మ గత ఏడాది నవంబర్ 13న కేరళలోని కన్నూర్ జిల్లా అయ్యన్‌కున్ను పంచాయతీలోని ఉరుప్పుం కుట్టి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో గాయపడింది. ఈ ఘటనలో మరో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందగా జయమ్మ గాయపడి తప్పించుకొని, మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఆమె మృతదేహాన్ని అటవీ ప్రాంతంలోనే ఖననం చేసి వివరాలను మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి

గడివేములకు చెందిన నాగార్జున, సుబ్బమ్మల కుమార్తె జయమ్మకు పాతికేళ్ల క్రితం బండిఆత్మకూరు మండలం పరమటూరుకు చెందిన సమీప బంధువు నామాల భాస్కర్‌తో వివాహమైంది. రెండేళ్ల వైవాహిక జీవితం అనంతరం విభేదాలతో విడిపోయారు. 2002లో అప్పటి పీపుల్స్‌వార్ రాజకీయాలతో ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లి మహానంది దళంలో పని చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలు విడిపోయాక 2005లో భాస్కర్ పోలీసులకు లొంగిపోయాడు. జనజీవన స్రవంతిలో చేరి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆ తర్వాత జయమ్మ మరో మావోయిస్టు జీవన్‌ను వివాహం చేసుకుంది. 2007లో నంద్యాల-గిద్దలూరు ఘాట్‌లో నెమళ్లజాడవద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో జీవన్ మృతిచెందగా అప్పటి మావోయిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు, జయమ్మతోసహా అయిదుగురు తప్పించుకున్నారు. ఆ ఎన్‌కౌంటర్‌తో నల్లమలలో బలహీనపడిన మావోయిస్టు పార్టీ కేడర్‌లోని కొంతమందిని కర్ణాటక ఏరియాకు బదిలీ చేసింది. అట్లా కర్ణాటకలో కొద్ది కాలం పని చేశాక కేళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఈమెపై 20కి పైగా కేసులున్నాయి.

22 మంది పోలీసులకు స్థాన చలనం

కర్నూలు, జనవరి 19: రాయలసీమ రేంజ్ పరిధిలో 22 మంది పోలీసు అధికారులకు స్థానచలనం కల్పిస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు బదిలీలు చేపట్టారు. ఇటీవలే కొద్ది మంది ఎస్ఐలకు, ఆర్‌పీఎస్ఐలకు కేటాయించిన స్థానాలను రద్దు చేసి కొత్త స్థానాలు కేటాయించారు.

పోలీసు పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శోభారాణి (డబ్ల్యూఎస్ఐ)	వీఆర్	హెచ్‌ఆర్‌ఏ కార్యాలయం
పి.మహ్మద్ అలీఖాన్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు తాలుకా	వీఆర్
ఎస్.సోమ్లా నాయక్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు (నాగులాపురం)	వీఆర్
జి.మల్లికార్జున (ఆర్‌పీఎస్ఐ)	డీటీసీ, కర్నూలు	వీఆర్
ఎంసీ రంగయ్య (ఆర్‌పీఎస్ఐ)	డీటీసీ, కర్నూలు	వీఆర్
బి.పుల్లన్న నాయక్ (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
పి.నిర్మలా దేవి (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
డీ.సీహెచ్ పుల్లయ్య (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
బి.ఉమాపతి (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్‌బీ	వీఆర్
సీహెచ్ వెంకట రమణ (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్	రేంజ్ వీఆర్, కర్నూలు
బీవీ రమణ రావు (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు త్రీటౌన్	రేంజ్ వీఆర్, కర్నూలు
వై.సుబ్బరాయుడు (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్	రేంజ్ వీఆర్
ఆశా బేగం (డబ్ల్యూఎస్ఐ)	నంద్యాల, వీఆర్	వీఆర్ అనంతపురం
ఆర్.శ్రీనివాసులు (ఆర్‌పీఎస్ఐ)	డీసీఆర్‌బీ, కర్నూలు	రేంజ్ వీఆర్
ఎస్ఏ రవూఫ్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు త్రీటౌన్	రేంజ్ వీఆర్
ఎస్.జాకీర్ హుశేన్	పీసీఆర్	సీసీఎస్ అన్నమయ్య
ఎస్ఎండీ జాఫర్ హుశేన్	కర్నూలు వన్‌టౌన్	పీసీఆర్, కర్నూలు
ఎ.అంజాద్ వలి (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
కేసీ తిరుపాల్ (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
ఎం.వెంకట చలపతి (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	డీటీసీ అనంతపురం
ఎ.రామకృష్ణయ్య (ఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
కె.రాజా కుళ్లాయప్ప (ఎస్ఐ)	అటాచ్డ్, చిత్తూరు	వీఆర్, కర్నూలు

దళితుల ద్రోహి జగన్

- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత


అంబేడ్కర్ చిత్రపటాన్ని పాలతో శుద్ధి చేస్తున్న గౌరు దంపతులు, మల్లెల

కల్లూరు, జనవరి 19: రాష్ట్రంలో దళిత ఉద్యోగులను పొట్టనపెట్టుకున్న ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం నగరంలోని గౌరు నివాసంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని పాలతో శుద్ధిచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక డాక్టర్ సుధాకర్, డాక్టర్ అచ్చెన్న వంటి ఉద్యోగులను పొట్టన పెట్టుకుందని విమర్శించారు. వైసీపీ పాలనలో వందల సంఖ్యలో దళితులు చిత్రహింసలకు గురయ్యారన్నారు. ఎన్నికల వేళ మళ్లీ దళితులను మోసం చేసేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, శివన్న, రజాక్‌భాషా, మధు, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు వ్యవసాయ విద్యుత్ కోత

కల్లూరు, జనవరి 19: జిల్లా కేంద్రంలోని 220 కెవి ఏపీ కార్బైడ్ ప్యాక్టరీ సమీపంలోని సబ్‌స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో 132 కేవీ ఆధునికీకరణ పనుల నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కోత ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ.యం. ఉమాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మూడో శనివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి అందించే త్రీఫేస్ కరెంట్‌లో అంతరాయం ఉంటుందన్నారు. అందులో భాగంగా కర్నూలు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని గూడూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, ఆలూరు సబ్ డివిజన్‌లోని అన్ని 33/11 కెవి సబ్‌స్టేషన్లలో కరెంట్ ఉండదన్నారు.

- నగరంలో విద్యుత్‌కోత: నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్‌కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్ ఈఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. నగరంలోని సెంట్రల్ సెక్షన్, బళ్ళారి రోడ్ సెక్షన్, సంతోష్‌నగర్ సెక్షన్, పవర్‌హౌస్ సెక్షన్, సి.క్యాంప్ సెక్షన్, ఓల్డ్‌టౌన్ సెక్షన్, కల్లూరు ఎస్టేట్ సెక్షన్‌లోని ఆయా ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతు పనులు లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందని అధికారులు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అవగాహన

పగిడ్యాల, జనవరి 19: గ్రామ పంచాయతీల అభివృద్ధికి పొదుపు సంఘాల మహిళలు తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. పగిడ్యాల వెలుగు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను పొదుపు మహిళలు అధికారుల దృష్టికి తీసుకవస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, మండల సమాఖ్య సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి ఏదీ?

పాణ్యం, జనవరి 19 : దళితుల పట్ల జగన్ ప్రేమ ఒలకబోస్తున్నారని డివిజన్ మాలమహానాడు నాయకులు దేవదత్తు ఆరోపించారు. శుక్రవారం అంబేడ్కర్ కూడలి వద్ద ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. అయితే కేవలం విగ్రహ ఏర్పాటుతో దళితులకు సామాజిక న్యాయం జరగదన్నారు. నాలుగేళ్ల పాలనలో ఎస్సీలకు చేసిందేమీ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లు మూసివేసి దళితులకు అన్యాయం చేశాడన్నారు. కౌలూరులో నాలుగేళ్లుగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయాలని కోరుతున్నా స్థానిక నాయకులు గానీ అధికారులు గానీ చర్యలు చేపట్టలేదన్నారు. కేవలం ఓట్ల కోసమే అంబేడ్కర్ విగ్రహన్ని ప్రారంభిస్తుండడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకలు భాస్కర్, నాగేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు భూమా పరామర్శ

నంద్యాల రూరల్, జనవరి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పరామర్శించారు. గోస్పాడు మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటి మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న భూమా బాధితుడ్ని పరామర్శించారు. ఆయన వెంట గోస్పాడు మండల కన్వీనర్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, డి.సి బాలుడు తదితరులున్నారు.

కామేశ్వరీదేవికి వజ్రపు ముక్కు పుడక

మహానంది, జనవరి 19: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవికి హైదరాబాద్‌కు చెందిన గోపాలకృష్ణశర్మ, సంతోషిదీప దంపతులు రూ.40,800 విలువ గల డైమండ్ స్టోన్ కలిగిన బంగారు ముక్కుపుడకను విరాళంగా అందజేసినట్లు ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు తెలిపారు. దాతలు శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో దాతలు ఏఈఓకు ముక్కుపుడకను అందజేశారు. అలాగే నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, నాగభూషణం పాల్గొన్నారు.

అండర్-14 జట్టుకు నంద్యాల క్రీడాకారుడు



కేవీ ఓంకార్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 19: ఆంధ్రప్రదేశ్ అండర్ -14 బాలుర క్రికెట్ జట్టుకు నంద్యాలకు చెందిన కేవీ ఓంకార్ ఎంపికైనట్లు కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ్ శుక్రవారం తెలిపారు. నంద్యాలలోని ఎస్పీవైరెడ్డి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓంకార్ ఇటీవలే నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీల్లో చిత్తూరు జట్టుపై 65 పరుగులు, అనంతపురం జట్టుపై 25 పరుగులు సాధించి స్టేట్ ప్రాపబుల్స్ జట్టుకు ఎంపికయ్యారు. స్టేట్ ప్రాపబుల్స్ పోటీలు గుంటూరులో జరగగా నార్త్ జోన్‌పై 53, 24 పరుగులు, సెంట్రల్ జోన్‌పై 34 పరుగులు సాధించి ప్రతిభ కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు దేవేంద్రగౌడ్ తెలిపారు. జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు గోవాలో జరిగే సౌత్ ఇండియా పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన ఓంకార్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్ మదన్ అభినందించారు.

శోభా యాత్రను జయప్రదం చేయండి

ఆత్మకూరు, జనవరి 19: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట వేడుకను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో నిర్వహించే శ్రీరాముడి శోభా యాత్రను జయప్రదం చేయాలని పట్టణ పురోహితుడు గరుడాద్రి సత్యనారాయణశర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శోభాయాత్ర గోడపత్రికలను వారు ఆవిష్కరించారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు రూరల్, జనవరి 19: ఆత్మకూరు మండలం సంజీవ్‌నగర్ తండా గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ నాగభూషణ్, ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌తో పాటు పోలీసు సిబ్బంది సంజీవ్‌నగర్ తండా గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి ఆ బట్టీవద్ద 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 500 లీటర్ల బెల్లపు ఊటను, నాటు సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జనవరి 19: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలుకు చెందిన బి. శివనాగమ్మ అనే భక్తురాలు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు జి. స్వాములుకు అందజేశారు.

రూ.కోటితో పురాతన భవనానికి సరికొత్త రూపు



భవవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, అధికారులు

నంద్యాల (కల్చరల్), జనవరి 19: నంద్యాల జిల్లాలో పునరుద్ధరించిన వారసత్వ సబ్ కలెక్టర్ కార్యాలయ భవనాన్ని రూ. కోటితో పునర్నిర్మించారు. ఈ భవనానికి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కేవలం రూ. కోటితో 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్అండ్‌బీ శాఖ అద్భుతంగా నిర్మించిందన్నారు. భవనం చుట్టూ ఉన్న ఐదు ఎకరాల స్థలానికి సంబంధించి ల్యాండ్ స్కేపింగ్ ద్వారా తోటలా మార్చుతామన్నారు. మంత్రి వెంట స్థానిక ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబీబుల్లా, కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

నంద్యాల (కల్చరల్), జనవరి 19: ఓటర్ల తుది జాబితాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ తుది జాబితా సిద్ధం చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సామూన్ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారికి నివేదించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్డీవోలు, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పాణ్యం, పాములపాడులో అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గోస్పాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కార్యకర్తలు



పగిడ్యాలలో...



మహానందిలో...

ఒకే మాట.. ఒకే బాట..

39వ రోజుకు చేరిన సమ్మె ● సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీల స్పష్టం

సమస్యల పరిష్కారం కోసం ఒకే మాట మీద ఉంటామని, పోరు మార్గాన్ని వదిలిపెట్టమని అంగన్‌వాడీ ఉద్యోగులు అన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె విరమించబోమని, నోటీసులకు బెదరమని స్పష్టం చేశారు. శుక్రవారం 39వ రోజు జిల్లాలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని, విధుల్లో చేరమని, అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అంగన్‌వాడీలు ఒకే మాట మీద ఉండాలని తీర్మానించారు.

ఆత్మకూరు, జనవరి 19: అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను విడనాడాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, నరసింహనాయక్, సుధాకర్ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మంజులు, రమణమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. అంగన్‌వాడీలో చేపట్టిన నిరసనలు శుక్రవారానికి 39వ రోజుకు చేరుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించుకునేవరకు పోరాటం వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రవణమ్మ, శివనాగమ్మ, ప్రమీలమ్మ, చెన్నమ్మ, లక్ష్మీదేవి, సుజాత, భారతి, ఖాదర్‌బీ, నాగమణి తదితరులు ఉన్నారు.

మహానంది: తమ పనికి తగ్గ వేతనం ఇచ్చి ఆదుకోండి సారూ అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. 39 వ రోజు శుక్రవారం మహానంది మండల తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు నారాయణమ్మ, సావిత్రి, కొండమ్మ, కళావతి, పుష్పకళ, ఉమాదేవి, నాయకులు ఏసురత్నం, నాగరాజు తెలిపారు.

పాములపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారానికి 30వ రోజుకు చేరింది. పాములపాడులో దీక్ష శిబిరం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శివలక్ష్మి, మద్దమ్మ, నాగమణి, రవణమ్మ, స్వాతి, హెల్పర్స్, సీఐటీయూ నాయకులు, సామన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మె చేపట్టి శుక్రవారానికి 39వ రోజుకు చేరింది. రాజకీయపార్టీలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నాగలింగేశ్వరం, రవి, రైతుసంఘం నాయకులుఏసన్న, రామిరెడ్డి, కర్ణ, రాము తదితరులు పాల్గొని సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాణ్యం: అంగన్‌వాడీల సమ్మె శుక్రవారానికి 39 వరోజుకు చేరింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు వెంకటమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పగిడ్యాల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని పగిడ్యాలలో అంగన్‌వాడీలు అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేక వినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. శుక్రవారం వెలుగోడు లోని దీక్ష శిబిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, తులసమ్మ, సావిత్రమ్మ, కుమారి, శోభారాణి, రవణమ్మ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

కొత్తపల్లి, జనవరి 19: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మండల కన్వీనర్ నారపురెడ్డి, మాజీ కన్వీనర్ జడ్. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు వెంకటస్వామిరెడ్డి, బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జయసూర్యతో పాటు టీడీపీ నాయకులు ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై 6వేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది హత్యకు గురయ్యారన్నారు. దళిత మహిళలకు రక్షణ లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పల్నాని మహేశ్వరరెడ్డి, శివారెడ్డి, ఏఎస్ రాజు, ఐటీడీపీ భాస్కర్, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, శివకుమార్, నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సింగరాజుపల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

దళిత ద్రోహి సీఎం జగన్

ఆత్మకూరు, జనవరి 19: దళిత ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ సీనియర్ నాయకుడు కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా పేర్కొన్నారు. శుక్రవారం దళితులకు సీఎం జగన్ చేస్తున్న అన్యాయాలను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట వారు నిరసన వెలిబుచ్చారు. వారు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై వివక్ష మొదలైందని మండిపడ్డారు. కోడికత్తి శ్రీను అరెస్టు ఐదేళ్లుగా బెయిల్ మంజూరు కాకుండా వేధిస్తున్నారని అన్నారు. అలాగే కరోనా సమయంలో మాస్కులు అడిన డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా హింసించి ఆయన మరణానికి కారకులయ్యారని చెప్పారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళిత యువకుడి చంపి డోర్‌డెలివరీ చేసినా ఆయనపై జగన్ మక్కువ చూపడం బాధాకరమని అన్నారు. దళితులకు ఇన్ని విధాలుగా అన్యాయం చేస్తూ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేసి దళితులను మభ్యపెట్టాలని అనుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరాముడు, ఆపార్టీ నాయకులు రాజారెడ్డి, ఫక్రుద్దీన్, నబిరసూల్, నాగూర్‌ఖాన్, ఆర్టీసీ రామకృష్ణ, సుబ్బరాజు, సతీష్, అడ్వకేట్స్ వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, రవికుమార్, మల్లికార్జునరెడ్డి, గౌస్, రమణ, జనసేన నాయకులు శ్రీరాములు, అరుణ్ తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, జనవరి 19: నంద్యాల జిల్లా సాయుధ బలగాలు ఏర్పాటు చేసిన మొబిలైజేషన్ ప్రారంభ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యమివ్వాలన్నారు. చట్టపరిధిలో జరుగుతున్న మార్పులు, శాంతిభద్రతల్లో కొత్తగా తలెత్తే సమస్యల పట్ల అవగాన కలిగి ఉండాలన్నారు. నిరంతరం వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాలని, భవిష్యత్ సవాళ్లకు దీటుగా తయారు కావాలని సూచించారు. ఉద్యోగంలో చేరేముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తుచేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ మొబలైజేషన్ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. ఏఆర్ సిబ్బంది అందరికీ మెడికల్ క్యాంప్ నిర్వహించి అందరికీ వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీఎస్పీ రంగముని, డీపీఓ ఏవో నిజాముద్దీన్, సూపరింటెండెంట్ ఖాదర్‌వలి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, శ్రీనివాసులు, మంజునాథ్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ దుష్టపాలనను తరిమిట్టాలి

ఆత్మకూరు, జనవరి 19: వచ్చే ఎన్నికల్లో వైసీపీ దుష్టపాలనను ప్రజలు తరిమికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నాలుగున్న ఏళ్ల వైసీపీ పాలనంతా అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలో సాగిందని అన్నారు. శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శిల్పా చేసింది ఏమీ లేదని విమర్శించారు. అనంతరం ఆపార్టీ మండల, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ నాయకులు రమేష్‌బాబు, సుబ్బరాయుడు, అహ్మద్‌హుసేన్, ప్రతాప్, చాంద్, లాలు, బీసన్న, ముర్తుజాబీ ఉన్నారు.

అక్రమ లే అవుట్లు వేస్తే చర్యలు

పాములపాడు, జనవరి 19: పాములపాడులో ఎలాంటి నిబంధనలు పాటించకుండా అక్రమ లే అవుట్‌లు వేసి అమ్ముతున్న వ్యాపారులపై పంచాయతీ అధికారులు కొరడా ఝుళిపించారు. కుడా అధికారులు రియల్ వ్యాపారులకు, అధికారులకు నోటీసులు జారీ చేశారు. అన్ని రకాల అనుమతులు తీసుకొని లే అవుట్‌లు వేసుకొని వ్యాపారం చేసుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు హెచ్చరించారు.

స్థానికేతరుల ఓట్లను తొలగించండి

గడివేముల, జనవరి 19: గ్రామంలో నివసించని స్థానికేతరుల ఓట్లను తొలగించాలని టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు ఫిర్యాదు చేశారు. మండలంలోని బూజనూరు, పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో ఓటరు జాబితాలో అవకతవకలపై, పోలింగ్ కేంద్రాల మార్పులపై ఫిర్యాదులు రావడంతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బంధువైన దస్తగిరిరెడ్డి బూజనూరు గ్రామ వాసి కాదని, అతని ఓటు బూజనూరు గ్రామంలో ఉందని, దాన్ని తొలగించాలని, అలాగే మృతుల ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పెసరవాయి గ్రామంలో పోలింగ్ కేంద్రాలు వేరు వేరుగా ఉండటంతో పంచాయతీ ఎన్నికల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయని, పోలింగ్ కేంద్రాలను ఒకే చోట నిర్వహించాలని టీడీపీ నాయకురాలు వడ్డు లక్ష్మీదేవి జేసీకి ఫిర్యాదు చేశారు. కరిమద్దెల గ్రామంలో పోలింగ్ కేంద్రాలను హైస్కూల్‌లు ఏర్పాటు చేయాలని గ్రామ నాయకులు జేసీని కోరారు. అనంతరం జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ స్థానికేతరుల ఓట్ల తొలగింపుకు నోటీసులు జారీ చేశామని, విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. కరిమద్దెల గ్రామంలో హైస్కూల్‌ను పరిశీలించారు. ర్యాంపు సరిగా లేదని, ఫ్లోరింగ్ లేదని రెవెన్యూ అధికారులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.



జేసీ నారపురెడ్డి మౌర్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

సమస్యలు తలెత్తకుండా సహకరించండి

పాణ్యం, జనవరి 19 : ఎన్నికల ఏర్పాట్లలో ఓటర్లకు సమస్యలు తలెత్తకుండా సహకరిస్తూ చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లాల ఎన్నికల నిర్వాహణాధికారి నారపురెడ్డి మౌర్య తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఓటింగ్ కేంద్రాల నిర్వాహణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. పాణ్యం మండలంలోని గగ్గటూరులో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామానికి వెళ్లి ఓటు వేయాల్సి వస్తోందని నాయకులు తెలిపారు. గోనవరంలో పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు లేదని తహసీల్దారు శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. ఎస్ కొట్టాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి వాటిపై జేసీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల నిర్వహణ సమస్యలను వెంటనే ఏఈఆర్వోలు పరిశీలించి నివేదికలు పంపాలని ఆదేశించారు.

కేంద్ర పథకాలపై అవగాహన ఉండాలి

ఆత్మకూరురూరల్, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలని ఎంపీడీవో మోహన్‌కుమార్, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వడ్లరామాపురం, కొట్టాల చెరువు గ్రామాల్లో మండల అధికారులతో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, పీఎం ఆవాస్ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్లను ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఆయా పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా, వైద్యాధికారి గోపాల్ నాయక్ హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి,కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశానికి తరలి రండి

ఆత్మకూరు, జనవరి 19: నంద్యాలలో ఆదివారం జరిగే బీజేపీ విస్తృత స్థాయి సమావేశానికి శ్రీశైలం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు మోమిన్ షబాన పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏవిధంగా ముందుకెళ్లాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చ ఉంటుందని అన్నారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పాటు జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు ప్రతాప్‌ఆచారి, సాంబ ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి




నంద్యాలలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 19: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని యూటీఎఫ్ గౌరవ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుసేన్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. నంద్యాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం శ్రీనివాససెంటర్ నుంచి నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2023 జులై నుంచి 12వ పీఆర్సీ అమలులో భాగంగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ప్రతి నెల 1న జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యప్రకాష్, సుజాత, రామ్మోహన్, అరవింద్ కుమార్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, కరువు భత్యం, పీఆర్సీ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తమ డిమాండ్ల సాధనకై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు అమీర్ అహ్మద్, బాలాజీరావు, సాయిప్రసాద్, బొజ్జయ్య, జాకీర్‌హుసేన్, శ్రీనివాసులు, రమణ, హరి, ఇమ్రాన్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

అభ్యుదయ వైతాళికుడు వేమన



నంద్యాలలో వేమన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల (కల్చరల్), జనవరి 19: మానవ జీవన సత్యాలను పద్యరూపంలో ప్రపంచానికి చాటిన అభ్యుదయ వైతాళికుడు యోగి వేమన అని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డా.దివి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. నంద్యాలలో మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారతి సీడ్స్ కార్యాలయంలో యోగి వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సదస్సులో ఉపాధ్యాయులు, కవులు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ రవీంద్రనాద్ హాజరై మాట్లాడుతూ పండిత పామరులను ఆబాల గోపాలాన్ని ప్రభావితం చేసేలా సామాజిక జీవన వాస్తవాలను మంచి పద్యాల ద్వారా తెలుగు వారికి వేమన తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుపండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి, కవులు మాబుబాషా, నీలకంఠమాచారి, డాక్టర్ కిషోర్‌కుమార్, రోటరీ విద్యాసంస్థల అధినేత డివి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: వేమన పద్యాలు సమాజానికి ఎంతో మేలుకొలుపునిచ్చాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటనర్సయ్య అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో 613వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కొనసాగుతున్న సమ్మె



రుద్రవరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కోవెలకుంట్లలో..

డోన్(రూరల్), జనవరి 19: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు డోన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన కొనసాగించారు. అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

- సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ స్పష్టం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, జిల్లా కోకన్వీనర్ జులైఖతో కలిసి డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీలు శుక్రవారం చేపట్టిన దీక్షల్లో ఆమె పాల్గొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైకేపీ పీవో రమణ భూలక్ష్మి, నాగ శంకర్, లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రామలక్ష్మి, హైమావతి, మునయ్య, లక్ష్మిబాయి, సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు సంఘీభావం వ్యక్తం చేశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం సమ్మెలో చేశారు. తమ డిమాండ్లను నేరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

చాగలమర్రి: ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని ఏఐఎస్‌టీయూసీ, సీఐటీఐ యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం తహసీల్దారు కార్యాలయం వద్ద 39వ రోజు శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల సంఘం నాయకురాళ్లు మనోజా, తిరుపాలమ్మ, బీబీ, రాజ్యలక్ష్మి,

బనగానపల్లె: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు కొనసాగాయి. అంగన్‌వాడీల దీక్షలు 39 రోజులకు చేరుకున్నాయి. సీఐటీయూ నాయకులు ఉబ్బయ్య, అంగన్‌వాడీ నాయకురాళ్లు అనసూయ, చంద్ర, తులసి, పద్మ తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నివాళి అర్పించారు.



దొర్నిపాడులో..



సంజామలలో..



బేతంచెర్లలో..

కోవెలకుంట్ల: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో చేపట్టిన సమ్మె 39వ రోజుకు చేకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంగన్‌వాడీ టీచర్ల నాయకురాళ్లు వెంకటలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామలలో రిలే దీక్షలు 39 వ రోజుకు చేరుకుంది. యూనియన్ అధ్యక్షురాలు సుజాత, అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అదనపు న్యాయాధికారి పూజలు



ఐదో అదనపు న్యాయాధికారిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆళ్లగడ్డ, జనవరి 19: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో వెలసిన కళ్యాణ వేంకటేశ్వరస్వామికి ఆళ్లగడ్డ కోర్టు జిల్లా ఐదో అదనపు న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించే ముందు ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆయన రాకను పురస్కరించు కొని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయనతో పూజలు చేయించారు. అనంతరం ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

వైసీపీ జిమ్మిక్కులను దళితులు నమ్మరు: సుబ్బారెడ్డి



డోన్, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పేరుతో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న జిమ్మిక్కులను దళితులు నమ్మరని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై 6వేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది హత్యకు గురయ్యారని అన్నారు. దళిత మహిళలకు రక్షణ లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. టీడీపీ హయాంలో నాలుగు లక్షల మంది దళిత యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. అంబేడ్కర్ విదేశీ విద్య ద్వారా దళిత యువతీ యువకులు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం టీడీపీ కల్పించిందన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యకు పేరు మార్చిన సీఎం జగన్.. ఇప్పుడు ఆయన విగ్రహం పేరుతో చేస్తున్న డ్రామాలను దళితులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని దళితులంతా ఎదురు చూస్తున్నారన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'



మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు

చాగలమర్రి, జనవరి 19: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమవుతుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. శుక్రవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన వైసీపీకి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీసీలకు కార్పొరేషన్‌లు, సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందన్నారు. రా.. కదలిరా సభలతో ప్రజల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, ఓబులేసు, బషీర్, మహబూబ్‌బాషా, రమేష్, సుబ్బరాయుడు, అబ్దుల్, దస్తగిరి, చోటు పాల్గొన్నారు.

నేడు కొచ్చెర్వులో 'జయహో బీసీ'

డోన్, జనవరి 19: డోన్ మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో శనివారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున శుక్రవారం తెలిపారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి హాజరవుతు న్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీ సెల్ కమిటీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలి'



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న శ్రీనివాసులు యాదవ్

డోన్(రూరల్), జనవరి 19: డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామ సమీపంలో వేస్తున్న రైల్వే అండర్‌బ్రిడ్జి వల్ల అటువైపు వెళ్లే గ్రామాల రైతులు, ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని డోన్ టీడీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్ కోరారు. శుక్రవారంకలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌ను కలిసి సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట వెంకటనాయునిపల్లె గ్రామ ప్రజలు ఉన్నారు.

కర్నూలుకు తరలిన బీసీ నాయకులు



కర్నూలుకు తరలి వెళ్తున్న బీసీ నాయకులు

ప్యాపిలి, జనవరి 19: కర్నూలులో నిర్వహించిన బీసీ సభకు శుక్రవారం మండలం నుంచి బీసీ నాయకులు తరలి వెళ్లారు. బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు వై. నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో వెళ్లారు. నాయకులు రామ్మోహన్‌యాదవ్, రాంపురం నాగేశ్వరరావు, కోదండ రామయ్య, మహేష్‌యాదవ్‌తో పాటు దాదాపు వందమంది వెళ్లారు.

వైభవంగా పల్లకీ సేవ

బనగానపల్లె, జనవరి 19: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్ల సేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవార్లకు పూజలు

రుద్రవరం, జనవరి 19: రుద్రవరంలో కన్యకా పర మేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి పూజలు చేశారు. చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాతకు విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి సామూహికంగా వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 దీపాలతో దీపోత్సవం చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

అన్నదాతల బాధలు పట్టవా?: టీడీపీ



చిన్నరాజుపాలెంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ



ఇంజేడులో కరపత్రాన్ని అందిస్తున్న భూమా అఖిలప్రియ

బనగానపల్లె, జనవరి 19: అక్రమ కేసులు, కక్షసాధింపు చర్యలు తప్ప బనగానపల్లె కరువు సమస్య, అన్నదాతల బాధలు వైసీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రజా ప్రతినిధులకు పట్టవా? అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని చిన్నరాజుపాలెం, యాగంటిపల్లె గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో రైతులకు సాగునీరు సరైన సమయంలో ఇవ్వడంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దద్దనాల ప్రాజెక్టుకును, దద్దనాల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని నిరుపయోగంగా మార్చారని విమర్శించారు. దద్దనాల ప్రాజెక్టుకు కనీసం పంపింగ్ కూడా సరిగా చేయడం లేదన్నారు. జలయజ్ఞం పేరుతో రైతులను దారుణంగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎటు చూసినా వైసీపీ నాయకుల అవినీతి, అక్రమాలు, బెదిరింపులతో ప్రజలు విసిగిపోయార న్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి శూన్యమ న్నారు. టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు చిన్నరాజుపాలెం గ్రామానికి రూ.214 లక్షలతో అభివృద్ధి చేశామని, రూ.83 లక్షలు రైతు రుణమాఫీ చేశామని చెప్పారు. యాగంటిపల్లె గ్రామంలో రూ.155 లక్షలతో అభివృద్ధి చేసి రూ. 147 లక్షల రైతుల రుణమాఫీ చేశామన్నారు. చిన్నరాజుపాలెం నరసింహులు, రామాంజనేయులు, చంద్రమోహన్, యాగంటిపల్లె చంద్రమౌళీశ్వరరెడ్డి, కుమార్‌రెడి మహేశ్వరరెడ్డి, దస్తగిరి, కృష్ణానాయక్, బాలనాయుడు, షేక్షావలి, సుధాకర్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామ వలంటీర్లను వైసీపీ నాయకులు రౌడీలుగా మారుస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంజేడు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డలో చంద్రబాబు పెట్టిన రా కదిలిరా సభకు లక్ష మందికి పైగా స్వచ్ఛందంగా వచ్చారన్నారు. రైతులకు సాగునీరు అందించటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ నెల 25వ తేదీన పత్తికొండలో జరిగే రా.. కదలిరా భారీ బహిరంగ భకుల తరలిరావాలని అఖిలప్రియ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ సీయం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, కన్వీనర్ కూడాల నారాయణరెడ్డి, సర్పంచ్ జైనాబీ, మండల నాయకులు మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి. పల్లె బాబుల్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి, అర్జిగారి నరసింహుడు, ఆకుల వెంకటసుబ్బయ్య, ఉప్పరమీది వెంకటేశ్వర్లు, గోతుల శేఖర్, ఉశేన్‌బాషా, గాండ్ల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'వైద్యం సక్రమంగా అందించాలి'

ప్యాపిలి, జనవరి 19: రోగులకు వైద్యం సక్రమంగా అందించాలని డివిజన్ వైద్యాధికారి చెన్నకేశవులు సూచించారు. మండలంలోని గుడిపాడు హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. క్లినిక్‌లో మందుల కొరత లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ మీడియా ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

డోన్(రూరల్), జనవరి 19: డోన్ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏపీ మీడియా ఫెడరేషన్ జిల్లా నాయకులు మహేష్, వలి, ఓబులేసు, మూర్తి తదితరుల ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. డోన్ ఏపీ మీడియా ఫెడరేషన్ గౌరవాధ్యక్షులుగా షాదీఖానా రాజా, అధ్యక్షుడిగా వడ్డె నాగరాజు, ఉపాధ్యక్షులుగా రెహంతుల్లా, హిట్లర్, ప్రధాన కార్యదర్శిగా జగన్, సలహాదారుడిగా శివరామయ్య ఆచారి, సహాయ కార్యదర్శిగా వంశీ, కోశాధికారిగా ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు.

'పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి'

ఆళ్లగడ్డ, జనవరి 19: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నంద్యాల పార్లమెంటు పరిధిలో పోలింగ్ కేంద్రం కమిటీల ఏర్పాటు, ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చిస్తారని తెలిపారు.

డోన్(రూరల్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఈ నెల 21వ తేదీన నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారని, పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ డోన్ నియోజకవర్గ కన్వీనర్ సంధు వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాలలో జాతీయ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమంలో పాల్గొంటున్నారని, అలాగే నంద్యాల పట్టణంలో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీరాముల విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించు కుని సెలవు దినాన్ని ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, మండల శాఖ అధ్యక్షులు రవికుమార్, దేవేంద్రుడు, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ, జనవరి 19: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ గుర్రప్ప శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని ఫీడర్లు, 33కేవీ లైన్ మరమత్తుల కారణంగా విద్యుత్‌ను నిలిపి వేస్తున్నామన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి ఇస్తామని చెప్పారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రామ్మోహన్ తెలిపారు. దొర్నిపాడు, చాకరాజువేముల, కొత్తపల్లె, గోవిందిన్నె, భాగ్యనగరం, కొండాపురం, అర్జునాపురం, అమ్మిరెడ్డినగర్ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండద న్నారు. యల్లావత్తుల, చిన్నకంబలూరు, రుద్రవరం, ఆలమూరు, హరి నగరం, చిత్తరేణిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా ఉండదని చెప్పారు.

'మెగా డీఎస్సీ నిర్వహించాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోవెలకుంట్ల, జనవరి 19: టెట్‌తో కూడిన మెగా డీఎస్సీని నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాల యంలో తహసీల్దారు పుష్పకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నా ఒక్క సారి మాత్రమే టెట్ పరీక్షలు నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రహీం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

చాగలమర్రి, జనవరి 19: మండలంలోని గొడిగనూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రెండు గడ్డివాములు శుక్రవారం దగ్ధమ య్యాయి. గ్రామంలోని తలారి చిన్నయ్య, పురుషోత్తమ్‌కు చెందిన గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ అధికారి వీరారెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. పశు బీమా సాయం కింద ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, జనవరి 19: పట్టణంలో ఉప్పునీళ్ల బావి దగ్గర నివాస ముంటున్న తెలుగు వెంకట్రాముడు (45) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన తెలుగు వెంకట్రాముడు తన భార్య తెలుగు చిన్నమ్మతో కలిసి బేతంచెర్ల నాపరాళ్ల ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం పట్టణంలోని ఉప్పునీళ్ళ బావి దగ్గర ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 11వ తేదీన మిద్దె ఎక్కి మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. వెంకట్రాముడు భార్య చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

4న గ్రామీణ వైద్యుల మహా సభ

బేతంచెర్ల, జనవరి 19: రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 4న జరిగే గ్రామీణ వైద్యుల మహా సభను విజయవంతం చేయాలని డా.గోవిందరెడ్డి, డా.శిరీష పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ శివారులోని చౌడేశ్వరి దేవాలయం ప్రాంగణంలో గ్రామీణ వైద్యులు నంద్యాల జిల్లా కోశాధికారి నాగసురేంద్ర గౌడు అధ్యక్షతన గ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో, పట్టణంలో సీజనల్ కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారన్నారు. గ్రామీణ వైద్యుల రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణయ్య ఫెడరేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి పిలుపు మేరకు ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర సదస్సుకు గ్రామీణ వైద్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు, నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు మండల కోశాధికారి వరప్రసాద్, నరసింహులు, లక్ష్మణ్ కృష్ణ, గురుస్వామి, రమణ, శివ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

'అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

రుద్రవరం, జనవరి 19: అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ జలవనరులశాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంటరమణ, ఏవో చంద్రశేఖర్, సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, ఎంపీపీ బాలస్వామి, జడ్పీటీసీ మాధవి, వైద్యాధికారులు గాయత్రి, అమర్‌నాధరెడ్డి, ఎంపీటీసీ మీరాంబీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల ప్రారంభం

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మించిన వైద్యశాలను, ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందరవాగుపై నిర్మించిన వంతెనను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర సాగునీటి పారుదల ప్రత్యేక సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. వైసీపీ కన్వీనర్ మండల బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ కపురం శివమ్మ, కపురం శ్రీనివాసరెడ్డి, సైట్ ఇంజనీర్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చాగలమర్రి, జనవరి 19: శెట్టివీడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై నోడల్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రమాద బీమా, సుకన్య సంవృద్ధి, బాలికల బంగారు భవితవ్యం, వివిధ పథకాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఏవో రంగనేతాజీ, ఏపీవో నిర్మల, కార్యదర్శి స్వప్న, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జనవరి 19: గ్రామాల్లో ప్రజలు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఉండటం వల్ల జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఉదయం పూట చలి గాలులకు దూరంగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జ్వరం, జలుబు వచ్చిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి పరీక్షలను చేయించుకోవాలని అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మద్దతు ధరతో జొన్న కొనుగోలు'

చాగలమర్రి, జనవరి 19: గ్రామాల్లో రైతుల నుంచి మద్దతు ధరతో జొన్నల కొనుగోలు చేస్తున్నట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మద్దతు ధర క్వింటా రూ.3,180 జొన్నలను ప్రభుత్వానికి విక్రయించాలని అన్నారు. రబీలో సాగు చేసిన పంటల నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. వీహెచ్ఏ ఉమామహేశ్వరి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.క్రిష్ణాపురంలో పార్వేట ఉత్సవ పల్లకీ



ఆర్.క్రిష్ణాపురంలో పూజలందుకుంటున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ, జనవరి 19: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురానికి చేరుకుంది. గ్రామంలోని తెలుపుల వద్ద పల్లకి విడిది చేయడంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు మేళతాళాలతో వెళ్లి భక్తి, శ్రద్ధలతో కాయ, కర్పూరం చెల్లించి పూజలు చేశారు. శనివారం కె.కందుకూరు గ్రామంలో అహోబిశుడు శనివారం పూజలు అందుకోనున్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ, జనవరి 19: అయోధ్యలో భవ్య రామ మందిర ప్రతిష్ఠ జరుగుతున్న శుభవేళ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మఠం అధికారులు శుక్రవారం చెప్పారు. శనివారం సంక్షిప్త, సుందరకాండ రామాయణం, ఆదివారం సుందరకాండ పారాయణం, అహోబిల నరసింహస్వామి మీద శ్రీరాముల వారు రచించిన పంచామృతస్తోత్రం 32 సార్లు పారాయణం, సోమవారం శ్రీరామపట్టాభిషేక సర్గ పారాయణం, తిరుమంజనం, సీతారామకళ్యాణోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, సంకీర్తన గోష్ఠి గానం జరుగుతుందని వివరించారు.

ఈవీఎంలపై అవగాహన

సంజామల, జనవరి 19: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు రెవెన్యూ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని అక్కంపల్లె, నొస్సం గ్రామాల్లో ఓటర్లకు ఆయా గ్రామ సచివాలయాల్లో అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ యంత్రాలపై ఎలాంటి అపోహలు వీడాలన్నారు. ఏ పార్టీ అభ్యర్థికి ఓటు బటన్ నొక్కగానే అదే పార్టీ అభ్యర్థి పేరు, గుర్తు స్క్రీన్‌పై కనబడతాయని తెలిపారు. వృద్ధులు, నిరక్షరాస్యులకు అవగాహన కల్పించారు. వీఆర్‌వోలు ఎరుకలయ్య, లక్ష్మయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కులగణన పకడ్బందీగా చేపట్టాలి'

రుద్రవరం, జనవరి 19: కులగణనను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రవరంలో తెలుగుపేట, బొరుగులపేట, చాకలిపేట, పడమటి వీధిలో కులగణన పరిశీలించారు. నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా చేయాలని ఆదేశించారు. కులగణనలో తప్పు ఒప్పులు జరిగితే మీదే బాధ్యత అని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాయక్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.